సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం : 24 : ఫిబ్రవరి : 2025



బ్రహ్మోత్సవ శోభ..
పరుపవేదీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి.
వివరాలు 8లో ▸



పర్యాటక కళ
కోయిల్‌సాగర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.8 /17.5

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉదయం, రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి.

క్షణక్షణం ఉత్కంఠ

రెండు రోజులుగా టన్నెల్‌లోనే ఎనిమిది మంది కార్మికులు

క్షణ క్షణం ఉత్కంఠ రేపుతోంది. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో 14వ కిలోమీటర్ వద్ద చిక్కుకుపోయిన ఎనిమిది మంది కార్మికులను కాపాడేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. 13 కిలోమీటర్ల తర్వాత సొరంగంలో బురద మట్టి, నీటితో పేరుకుపోవడంతో ముందుకు వెళ్లేందుకు సాధ్యపడటంలేదు. దీంతో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, ఆర్మీ, సింగరేణిలోని నిపుణులతో కూడిన రెస్క్యూ బృందాలను రంగంలోకి దింపారు. సహాయక చర్యలు రాత్రంతా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు మూడు విడతలుగా సహాయక బృందాలు టన్నెల్‌లోకి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాయి. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో నాలుగో బృందం లోపలికి వెళ్లగా.. అర్ధరాత్రి తర్వాత ఐదో బృందం టన్నెల్ లోపలికి వెళ్లింది.

– సాక్షి, నాగర్‌కర్నూల్ /అచ్చంపేట

- రాత్రంతా కొనసాగుతున్న సహాయక చర్యలు
- అర్ధరాత్రి తర్వాత టన్నెల్‌లోకి ప్రవేశించిన ఐదో బృందం
- రెస్క్యూ ఆపరేషన్‌లో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, ఆర్మీ, ఫైర్, సింగరేణి, హైడ్రా బృందాలు
- టన్నెల్ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి

శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ) ఇన్‌లెట్ సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల రెస్క్యూ ఆపరేషన్‌పై రెండు రోజులుగా ఉత్కంఠ నెలకొంది. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను చేరుకోలేకపోవడంతో ఇంకా ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతోంది. వారిని సమీపించేందుకే సహాయక బృందాలకు సాధ్యపడటంలేదు. 9.8 మీటర్ల వ్యాసార్థం ఉన్న సొరంగం నిండా మట్టి, బురద నిండిపోవడంతో కార్మికుల వద్దకు చేరడం కష్టంగా మారింది. టన్నుల కొద్దీ పేరుకున్న మట్టిని తొలగించడం సైతం కుదరడం లేదు. ఈ నేపథ్యంలో కార్మికుల జాడ గుర్తింపుపై సందిగ్ధం నెలకొంది.

సహాయక చర్యలకు ఆటంకాలే..


సొరంగంలో కార్మికులను కాపాడేందుకు రంగంలోకి ఆర్మీ (24), ఎన్డీఆర్‌ఎఫ్(120), ఎస్డీఆర్‌ఎఫ్(24), సింగరేణి(24), హైడ్రా(24) రెస్క్యూ సిబ్బందితో కూడిన బృందాలు పెద్ద ఎత్తున చేరుకున్నాయి. ఆయా శాఖల సమన్వయంతో విడతల వారీగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. సుమారు 6–8 గంటలకు ఒక బృందం చొప్పున షిఫ్టుల వారీగా సహాయక చర్యలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. ప్రమాదం జరిగిన 13వ కి.మీ. వద్దకు లోకో ట్రైన్ వెళ్లడానికి గంట, రావడానికి గంట సమయం పడుతోంది. అక్కడ పెద్ద ఎత్తున మట్టి, రాళ్లతో కూడిన శిథిలాలు పేరుకుని ఉండటంతో రెస్క్యూ టీంలు అక్కడికి చేరుకోలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో సహాయక చర్యలు ఇలాగే కొనసాగితే వారిని రక్షించడం కష్టంగా మారుతోంది. సంఘటన స్థలంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షిస్తున్నారు.

పంథా మార్చితేనే సాధ్యం..

కార్మికులను కాపాడేందుకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలు ఫలించలేదు. కొత్త పంథా(టెక్నిక్)లో వెళ్లితే తప్ప వారిని బయటికి తీసుకురావడం సాధ్యపడే పరిస్థితి కనిపించడం లేదు. సొరంగంలో ఒకే మార్గం గుండా రాకపోకలు చేయాల్సి రావడం, ఎలాంటి ఆడిట్, ఎస్కేప్ టన్నెళ్లు లేకపోవడంతో రెస్క్యూ వీలు కావడం లేదు. రాకపోకలకు, మట్టిని తరలించేందుకు ఒకే ఒక కన్వేయర్ బెల్టు ఉండగా, ఆ మట్టి తరలించేందుకు దాదాపు మూడు రోజుల సమయం పడుతుందని చెబుతున్నారు. సొరంగంలో నుంచి మట్టిని, రాళ్లను తొలగించడం అంతా సాధ్యమైన పని కాదని అంటున్నారు. దీంతో కొత్త పంథాలో సహాయక చర్యలు చేపడితేనే ప్రయోజనం ఉండనుంది.

ఉత్తరాఖండ్ తరహాలో రెస్క్యూకు సన్నద్ధం..

టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఇంకా ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. గతంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించిన తరహాలోనే ఇక్కడ కూడా ఆపరేషన్ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ర్యాట్ హోల్ మైనింగ్ ద్వారా పై నుంచి రంధ్రం చేసి కార్మికులను బయటకు తీసుకొచ్చేలా ప్రయత్నించే అవకాశం ఉంది. ఇందుకు గల సాధ్యాసాధ్యాలను సైతం పరిశీలించనున్నారు.



ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్ద వివిధ సహాయక బృందాలు, అధికారులు



సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్



సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్న ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు

టన్నెల్‌లోకి వెళ్లేందుకు జంకుతున్న కార్మికులు..

టన్నెల్‌లో ప్రమాద స్థలానికి చేరుకుని రెస్క్యూ టీంలు సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, వారితో పాటు లోపలికి వెళ్లి మట్టి, శిథిలాలను తొలగించేందుకు కార్మికులు జంకుతున్నారు. కళ్ల ముందే ప్రమాదం చోటుచేసుకోవడంతో వారు భయభ్రాంతులకు లోనయ్యారు. ఈ క్రమంలో లోపల శిథిలాల తొలగింపు, మట్టి తొలగింపునకు కార్మికులు వెనకాడుతుండటంతో సహాయక చర్యల్లో మందగమనం నెలకొంది. దీంతో లోపలికి వెళ్లి విధులు నిర్వర్తించే కార్మికులకు దినసరి వేతనం రూ.2 వేల చొప్పున ఇవ్వాలని ఓ ఉన్నతాధికారి సంబంధిత కంపెనీ ప్రతినిధికి సూచించారు.



సొరంగంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

సోమవారం ఉదయానికి ఈ తరహా రెస్క్యూ బృందాలు ప్రమాదస్థలికి చేరుకునే అవకాశం ఉంది.

భద్రతా ప్రమాణాలపై అనుమానాలు..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తొలుస్తున్న టీబీఎం కొన్ని రోజులుగా మరమ్మతుకు గురై పెద్ద శబ్ధంతో పని చేస్తోందని కొందరు కార్మికులు చెబుతున్నారు. అలాగే అసంపూర్తిగా కాంక్రీట్ సెగ్మెంట్ ఉండటం, భద్రతా ప్రమాణాలు పాటించకనే ప్రమాదం జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వీటిపై అధికారులు స్పందించడం లేదు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు దాదాపు నాలుగేళ్ల తర్వాత ఈ నెల 18న పునఃప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ముందస్తుగా పనుల వద్ద సేఫ్టీ ప్రమాణాలు పాటించలేదని తెలుస్తోంది. పని మొదలుపెట్టిన నాలుగు రోజులకే ప్రమాదం చోటుచేసుకోవడంతో భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

న్యూస్‌రీల్

పాలకుల నిర్లక్ష్యంతోనే నత్తనడకన పనులు

- ఎస్‌ఎల్‌బీసీ ఘటనకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి
- సీపీఐఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సాక్షి, నాగర్‌కర్నూల్/ అచ్చంపేట: గత పాలకులు ఎస్‌ఎల్‌బీసీకి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడంతోనే టన్నెల్ పనులు నిర్దేశిత సమయంలో పూర్తి చేయలేకపోయారని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే (సీపీఐఎం) జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ఇద్దరు ఇంజినీర్లతో పాటు ఇద్దరు మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఇరుక్కుపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించిన ఆయన అక్కడే ఉన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడి.. సొరంగంలో ఇరుక్కుపోయిన వారిని రక్షించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు గ్రావిటీ ద్వారా నీరందించడానికి తలపెట్టిన టన్నెల్ పనులను సకాలంలో పూర్తిచేయకపోవడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సుమారు రూ.2 వేల కోట్లతో చేపట్టిన పనులను నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉండగా.. 20 ఏళ్లు అయినా పూర్తి చేయలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీకి ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో పదేళ్లపాటు పనులు నిలిచిపోయాయని విమర్శించారు. ఫలితంగా వ్యయం పెరిగి.. అంచనా బడ్జెట్ రూ.4,600 కోట్లకు చేరిందని దుయ్యబట్టారు. టన్నెల్‌లో ఇరుక్కుపోయిన వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి అన్నివిధాలా ఆదుకోవాలని, ఈ ఘటనకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. వివిధ తరగతుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 990 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 920 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. కాగా, 10 మంది విద్యార్థులకు వివిధ కారణాలతో ఓఎంఆర్ షీట్ రాకపోవడంతో పరీక్ష రాయలేకపోయారు.

సేవాలాల్ మహరాజ్ జీవితం ఆదర్శనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితం అందరికీ ఆదర్శనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి హరిహరా టౌన్‌షిప్ వరకు గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే ఆడి పాడారు. గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని తండాలు, గ్రామపంచాయతీలను అనుసంధానం చేస్తూ బీటీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గిరిజన భవన్ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేశామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేంగా చేపడుతున్నట్లు చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, హనుమాన్ నాయక్, దేవీలాల్ చౌహాన్, నిరంజన్ నాయక్, శివరాం, రాజు నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ తగ్గింది. వ్యవసాయ పనులు ఉండటంతో ఆదివారం తక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 6వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ తగ్గడంతో జాతరలో పలు దుకాణాలు వెలవెలబోయాయి.

వేరుశనగ @ 7,369

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ. 7,369, కనిష్టంగా రూ. 4,001, సరాసరి రూ. 7,009 ధరలు వచ్చాయి. మొత్తం 230 మంది రైతులు 1,947 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి తీసుకువచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శివరాజ్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని వివరించారు.

‘స్కానింగ్’ భారం!



జిల్లా జనరల్ ఆస్పత్రిలో రేడియాలజిస్టు లేకపోవడంతో మూతపడిన స్కానింగ్ రూం



పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

- జిల్లా జనరల్ ఆస్పత్రిలో నాలుగు నెలలుగా నిలిచిన సేవలు
- రేడియాలజిస్టు లేకపోవడంతో రోగుల అవస్థలు
- స్కానింగ్‌కు ప్రైవేటు సెంటర్లే దిక్కు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రస్తుతం ఏ వ్యక్తికి అయినా జబ్బు చేసి ఆస్పత్రికి వెళ్తే.. వైద్యులు రక్త పరీక్షలతో పాటు స్కానింగ్‌పైనే ఆధారపడి రోగాన్ని గుర్తించే రోజులు ఇవి. ఆర్థిక భారం మోయగలిగే వారు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి జబ్బును నయం చేసుకుంటారు. డబ్బులేని పేదలు మాత్రం ఆధారపడేది ప్రభుత్వ ఆస్పత్రులపైనే. ఈ నేపథ్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు సెంటర్లలో స్కానింగ్ చేయించుకుంటూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాలుగు నెలలుగా మూత..

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుతో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నప్పటికీ.. జనరల్ ఆస్పత్రిలో నాలుగు నెలలుగా రేడియాలజిస్టు అందుబాటులో లేకపోవడంతో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో గర్భిణులు, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు, ఇతర రోగులు స్కానింగ్ చేయించుకోవాలంటే ప్రైవేటు సెంటర్లే దిక్కయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ఉచితంగా చేసే స్కానింగ్‌కు ప్రైవేటు సెంటర్లలో రూ.800 వసూలు చేస్తున్నారు. అదే విధంగా ఆరు నెలలకోసారి గర్భిణులకు చేయాల్సిన టిఫా స్కానింగ్ కోసం రూ. 1,800 వరకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో చెల్లిస్తున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కానింగ్ అవసరమయ్యే ప్రతి రోగిపై ఆర్థిక భారం పడుతుందని.. జనరల్ ఆస్పత్రిలో రేడియాలజిస్టును నియమించాలని కోరుతున్నారు.

ఆసక్తి చూపని రేడియాలజిస్టులు

ప్రస్తుతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో రేడియాలజిస్టులకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. వారికి చెల్లించే జీతం కూడా రూ.లక్షల్లో ఉండటంతో జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు తర్వాత సీనియర్ రెసిడెంట్‌గా పనిచేసేందుకు రేడియాలజిస్టు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. రేడియాలజిస్టు కాలపరిమితి ముగిసిన తర్వాత వెళ్లిపోవడంతో స్కానింగ్ సేవలు నిలిచిపోయి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న రేడియాలజిస్టు పోస్టుకు నోటిఫికేషన్ జారీ చేసినా పనిచేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. రోజు జనరల్ ఆస్పత్రికి దాదాపు వెయ్యి మంది వరకు రోగులు వైద్యం కోసం వస్తుంటారు. వారిలో చాలా మందికి స్కా నింగ్ సేవలు అవసరం పడుతుండటంతో ఇబ్బందికరంగా మారింది. జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నోటిఫికేషన్ జారీ చేశాం..




జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు స్కానింగ్ సేవలు అందించేందుకు గాను రేడియాలజిస్టు నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో రేడియాలజిస్టుకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో జనరల్ ఆస్పత్రిలో పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక అందజేశాం. జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– డా.రఘు, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

గ్రామపంచాయతీల్లో నిరుపయోగంగా పరికరాలు

- ఇంటర్నెట్ సౌకర్యం లేక మరుగున పడిన ఈ–పాలన
- డిజిటల్ సేవలు అందక ప్రజల ఇబ్బందులు
- టీ–ఫైబర్ సేవల కోసం ఎదురుచూపులు

టీ–ఫైబర్ సేవలెప్పుడో?



అచ్చంపేట రూరల్: ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్ సేవలు ఎంత అవసరమో చెప్పనవసరం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలతో పాటు ప్రతి పనికి సాంకేతికతతో ముడిపడి ఉంది. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామపంచాయతీలో ఈ–పాలన, ఇంటింటికీ తక్కువ ధరకే ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 2017లో టీ–ఫైబర్ సేవలకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులు, రైతు వేదికలు, ఇతర ప్రజా సేవల సంస్థలకు అధిక వేగంతో కూడిన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మిషన్ భగీరథ పథకం పైపులైన్లు నిర్మించే సమయంలో టీ–ఫైబర్ కేబుల్ వేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో టీ–ఫైబర్ పరికరాలను సైతం అమర్చారు. అయితే ఇప్పటి వరకు టీ–ఫైబర్ సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు.

జాడలేని ఈ–పాలన..

పంచాయతీ పాలనలో పారదర్శకత, జవాబుదారితనంతో పాటు డిజిటల్ సేవలు అందించాలని గతంలో క్లస్టర్ల వారీగా ఈ–పంచాయతీ ఆపరేటర్లను నియమించారు. కంప్యూటర్లు, ప్రింటర్లు అందించారు. జిల్లావ్యాప్తంగా 461 గ్రామ పంచాయతీలు ఉండగా.. సుమారు 60 మంది ఈ–పంచాయతీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, నిధుల కేటాయింపు, ఆదాయం, వ్యయాలు, జీతభత్యాలు, జనన, మరణ ధ్రువపత్రాల జారీ, ఇంటి పన్ను తదితర సేవలను ప్రజలకు డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రధాన ఉద్దేశం. అయితే పంచాయతీల్లో ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి రాకపోవడంతో ఈ–పాలన జాడ లేకుండా పోయింది. చాలా వరకు ఈ–పంచాయతీ ఆపరేటర్లు మండల పరిషత్ కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పథకాల్లో ఏమైనా అవాంతరాలుంటే లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయాలకు వచ్చి వాకబు చేయాల్సి వస్తోంది. పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్న వారికి కార్యదర్శులు చేతి రాత రశీదులను జారీ చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా టీ–ఫైబర్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తే.. గ్రామాల్లోనే డిజిటల్ సేవలు అందుతాయని ప్రజలు కోరుతున్నారు.



ఉప్పునుంతల మండలం కాంసానిపల్లి జీపీలో నిరుపయోగంగా ఉన్న టీ–ఫైబర్ పరికరాలు

పరికరాల బిగింపుతోనే సరి..

జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో అవసరమైన టీ–ఫైబర్ కేబుల్, పరికరాలను సైతం బిగించారు. విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ ఫలకలు, ఇన్వర్టర్ బ్యాటరీలు అమర్చారు. సాంకేతిక సిబ్బంది పంచాయతీలకు వచ్చి టెస్టింగ్ కూడా నిర్వహించారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో టీ–ఫైబర్ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి.

అవస్థలు పడుతున్నాం..



చిన్నచిన్న పనులకు మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుండటంతో దూర, వ్యయభారం అవుతోంది. ఒక్కోసారి రోజుల తరబడి తిరగాల్సి వస్తుండటంతో అవస్థలు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో టీ–ఫైబర్ సేవలు అందించాలి. – కొమిరె చెన్నకేశవులు, కాంసానిపల్లి, ఉప్పునుంతల మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో టీ–ఫైబర్‌కు సంబంధించిన పరికరాలను బిగించారు. విద్యుత్ కనెక్షన్లు కూడా ఇచ్చారు. వాటి నుంచి గ్రామ పంచాయతీలకు ఎలాంటి సేవలు అందడం లేదు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సేవలు అందుబాటులోకి వస్తే పనులు సులభతరం అవుతాయి. – రామ్మోహన్‌రావు, డీపీఓ

ఎన్నికలలోగా జరిగేనా..

ప్రస్తుతం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ, విజేతల వివరాలు ఇలా ప్రక్రియంతా ఇంటర్నెట్ ద్వారానే జరగాల్సి ఉంటోంది. గ్రామాల్లో సేవలు అందుబాటులో లేక మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాగా, గ్రామపంచాయతీల్లో ఇంటర్నెట్ సేవలు ప్రారంభించకముందే విద్యుత్ సౌకర్యం కోసం మీటర్లు బిగించారు. దీంతో పంచాయతీల్లో రూ.వేలల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. సేవల మాటేమో గాని బిల్లుల మోత మాత్రం తప్పడం లేదు.

క్లుప్తంగా

అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు..


సిరిగని రాములు (ఫైల్)

మద్దూరు: మతిస్థిమితం సరిగ్గా లేక మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. మండలంలోని రెనివట్లకు చెందిన సిరిగని రాములు (50) కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించే వాడు. ఈ నెల 20న తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 22న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పెదిరిపాడ్ గ్రామ శివారులో ఓ మామిడిచెట్టుకు ఉరేసుకున్న వ్యక్తిని స్థానికులు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాములు భార్య నర్సమ్మతో కలిసి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడింది రాములు అని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్షణికావేశంలో బాలిక బలవన్మరణం

రాజాపూర్ (బాలానగర్): చిన్న విషయానికి అక్కతో గొడవపడి క్షణికావేశానికి లోనైన ఓ బాలిక ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. బాలానగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన కృష్ణయ్య, యాదమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో చిన్న కూతురు సింధు(17) షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాలలో నర్సింగ్ కోర్స్ చదువుతుంది. అయితే కృష్ణయ్య కుటుంబం బాలానగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గ్రానైట్ రాయి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అయితే ఆదివారం ఇంట్లో ఉన్న అక్క (రెండో కూతురు)తో సింధు గొడవపడింది. ఈ క్రమంలోనే క్షణికావేశానికి లోనైన బాలిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. అనంతరం గమనించిన కుటుంబ సభ్యు లు కిందకి దించి చూడగా అప్పటికే మృతిచెందడంతో బోరున విలపించారు. ఈ ఘటనపై తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

తల్లి మందలించిందని కుమారుడి..


అనిల్‌కుమార్ (ఫైల్)

ఉండవెల్లి: తల్లి మందలించడంతో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉండవెల్లి మండలం తక్కశీల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తక్కశీలకు చెందిన జోగు జయమ్మకు కుమారుడు అనిల్‌కుమార్ (18), కుమార్తె ప్రభావతి ఉన్నారు. మద్యానికి బానిసైన అనిల్ కుమార్ పదో తరగతి వరకే చదివి పనులకు వెళ్తున్నాడు. శనివారం సాయంత్రం తల్లిని డబ్బులు అడగడంతో మందలించింది. దీంతో క్షణికావేశానికి గురైన అనిల్‌కుమార్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


రాజు (ఫైల్)

భూత్పూర్: పుర పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన కెంద్యాల రాజు (45) ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కెంద్యాల రాజు పని నిమిత్తం స్వగ్రామం నుంచి జడ్చర్లకు బైక్‌పై బయలుదేరాడు. శేరిపల్లి సమీపంలోని అంబట్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న ఇనుప స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భూత్పూర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి తమ పరిధి కాదని మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

తాడూరు: మండలంలోని పాపగల్‌లో ఆదివారం తాళం వేసిన మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. పెద్దరాములు ఇంట్లో మూడు తులాల బంగారు పుస్తెల తాడు, 2 జతల కమ్మలు, రూ.50 వేలు, చెన్నయ్య ఇంట్లో 2.50 తులాల బంగారు చైన్, ఎండీ షఫీ ఇంట్లో రూ.20 వేలు, 10 తులాల వెండి ఎత్తుకెళ్లారని వివరించారు. ఇళ్లు రోడ్డు పక్కనే ఉండటం, తాళాలు వేయడంతోనే చోరీ జరిగి ఉంటుందని.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మీనాంబరం తీరాన బ్రహ్మోత్సవ శోభ


మీనాంబరం వాగు తీరాన ఉన్న పరుషవేదీశ్వర స్వామి ఆలయం

- రేపటి నుంచి పరుశవేదీశ్వరుడి ఉత్సవాలు
- నాలుగు రోజులపాటు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మండలం కుర్వగడ్డపల్లి సమీపంలోని మీనాంబరం వాగు తీరాన వెలసిన పరుషవేదీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. కృతయుగం చివర, త్రేతాయుగం ప్రారంభంలో పరుషవేదీశ్వరుడి ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. పరుషరాముడు మీనాంబరం వాగు తీరాన ఇసుకతో లింగం చేసి ప్రతిష్ఠించాడని ప్రతీతి. పరుషరాముడు స్పర్శతో ప్రతిష్ఠించిన లింగం కావడంతో పరుషవేదీశ్వరుడిగా మహాశివుడిని కొలుస్తారు. అయితే పరుషరాముడు ప్రతిష్ఠించిన శివలింగాల ఆలయాలన్నీ పడమరవైపుగా ఉంటాయి. అదే తరహాలో ఇక్కడ స్వామివారి ఆలయం ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో పడమర వైపు ముఖద్వారం ఉన్న 17 శైవక్షేత్రాల్లో ఇది ఒకటి. అంతే కాకుండా అతిపెద్ద పానవట్టం కలిగి ఉంటుంది. మీనాంబరం వాగులో నిర్మించిన చెక్‌డ్యాంల్లో నీటి నిల్వతో ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

కార్యక్రమాలు ఇలా..

పరుషవేదీశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీప స్థాపన, రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. 26న మహా శివరాత్రి సందర్భంగా స్వామికి అభిషేకాలు, రాత్రి 9గంటలకు శివపార్వతుల కల్యాణం, పల్లకీ సేవ, 12 గంటలకు లింగోద్భవ అభిషేకాలు చేయనున్నారు. 27న అమావాస్యను పురస్కరించుకుని అభిషేకాలు, రాత్రి రథోత్సవం, శుక్రవారం అభిషేకాలు, శకటోత్సవం నిర్వహిస్తారు.


పరుషవేదీశ్వరస్వామి

చేపలు అంబరాన్ని తాకడంతో..

పురాతన నిషాద రాజ్యానికి చెందిన నలచక్రవర్తి దమయంతితో కలిసి అరణ్యవాసంలో కాలం గడుపుతూ దుందుభీ వాగు తీరానికి వచ్చాడు. వాగులో నలచక్రవర్తి పట్టిన చేపలను వండమని దమయంతికి ఇచ్చాడట. ఆమె వాటిని అదే వాగు తీరాన వండి ఉడికాయా లేదా అని పరిశీలించేందుకు అక్కడే ఉన్న కట్టెపుల్లతో కలపగా.. ఉడికిన చేపలన్నీ జీవం పోసుకుని వంటపాత్ర నుంచి ఆకాశమంత ఎత్తుకు ఎగిరి వాగులో పడిపోయాయట. చేపలు (మీనం) అంబరాన్ని తాకడంతో ఈ ప్రాంతానికి మీనాంబరంగా పేరు ప్రసిద్ధిగాంచింది. అయితే ఔరంగజేబు హయాంలో పరుషవేదీశ్వరుడి ఆలయం ధ్వంసంకాగా.. ఇప్పుడిప్పుడే పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. శిథిలమైన ఆలయాన్ని 1959లో గంగాపూర్ గ్రామానికి చెందిన గంధం రామచంద్రయ్య బాగు చేయించి అరుగులు కట్టించారు. ప్రస్తుతం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ప్రాకారం నిర్మించడంతో పాటు మెట్లు, నవగ్రహాలు, గంట, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణ మండపాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నెరవేరనున్న పర్యాటక కళ


కోయిల్‌సాగర్ వద్ద పర్యాటకులు (ఫైల్)

- కోయిల్‌సాగర్ వద్ద అభివృద్ధి పనులకు రూ..3.50 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలోనే టెండర్ల ఆహ్వానం


GOVERNMENT OF TELANGANA
ABSTRACT

YAT & C (TSPHU) Department – TGTDC – Development of the amenities at Koilsagar Project, Koilsagar Village, Devarakadra Mandal in Mahabubnagar District – Administrative sanction – Accorded – Orders – Issued.

YOUTH ADVANCEMENT TOURISM AND CULTURE (TSPHU) DEPARTMENT

ORDER:

ప్రభుత్వం విడుదల చేసిన జీఓ కాపీ

దేవరకద్ర రూరల్: దశాబ్దాల కల నెరవేరబోతోంది. ఏళ్లుగా నిరాదరణకు గురవుతున్న కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.3.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. త్వరలోనే పనులకు సంబంధించి టెండర్లు పిలువనుంది.

రూ.85 లక్షల వ్యయంతో..

1945లో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో రూ.85 లక్షల అంచనా వ్యయం, 2.276 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. రెండు గుట్టలను కలిపి సిమెంట్ వినియోగించకుండా డంగు సున్నంతో ప్రాజెక్టును నిర్మించారు. అప్పటి ఇంజినీరింగ్ అధికారుల నైపుణ్యాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తూ అందరిని ఆకట్టుకుంటోంది. ఆ సమయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా కొనసాగుతున్నప్పటికీ.. ఉద్యమ ప్రభావం ప్రాజెక్ట్ నిర్మాణంపై పడకుండా, చుట్టుపక్కల గ్రామాల ప్రజలను సమన్వయం చేసుకొని సుమారు 8 ఏళ్లలో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం 1948లో జరిగిన ఆపరేషన్ పోలోలో భారత సాయుధ దళాలు హైదరాబాద్ రాష్ట్రంలో నిజాంను ఓడించి భారతదేశంలో విలీనం చేశారు. 1955లో అప్పటి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి కేఎం ఖర్జూ హాజరై ప్రాజెక్ట్‌ను ప్రారంభించి కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు.

హరిత హోటల్, కాటేజీలు, బోటింగ్..


బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో కోయిల్‌కొండ కోట, రామగిరి, రాంకొండను కలిపి ఒక సర్క్యూట్‌గా చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా.. అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గతేడాది ఆగస్టులో కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో హరిత హోటల్‌తో పాటు కాటేజీలు, బోటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలువనున్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం..



ప్రభుత్వం పర్యాటక రంగాన్ని ఉపాధి కల్పన రంగంగా భావించి ప్రాధాన్యం ఇస్తోంది. కోయిల్‌సాగర్‌ను రాష్ట్రంలోనే ఉత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. పర్యాటకులు తగినంత సమయం గడిపేందుకు అన్ని వసతులు కల్పిస్తాం. బస, బోటింగ్, రెస్టారెంట్ ఏర్పాటుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పనులు త్వరగా పూర్తయితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. – జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే

సౌకర్యాలు కల్పించాలి..



కుటుంబంతో కలిసి సందర్శించేందుకు కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ అనువైన ప్రదేశం. అయితే కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రాజెక్ట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. – కుతుబుద్దీన్, దేవరకద్ర

పర్యాటకులు వస్తుంటారు..



పర్యాటకులు కుటుంబాలతో కలిసి కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌కు వస్తుంటారు. నీటి విడుదల సమయంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. వారాంతపు రోజుల్లో వివిధ ప్రాంతాల యువత కార్లు, బైక్‌లపై వచ్చి టెంట్లు వేసుకొని రెండ్రోజుల పాటు ఉండి వెళ్తుంటారు. తగిన ఏర్పాట్లు చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. – అంజిల్‌రెడ్డి, పెద్దరాజమూర్

ఉపాధి లభిస్తుంది



ప్రస్తుతం డ్యాం దగ్గర చిన్నపాటి హోటల్ ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నా. ఇక్కడి చేపలకు మంచి డిమాండ్ ఉండటంతో సందర్శకులు చేపలు తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పర్యాటక కేంద్రంగా మారిస్తే మరింత మందికి ఉపాధి దొరుకుతుంది. – అరుణ, బొల్లారం

పీహెచ్‌సీ ఎదుట బాధితుల ఆందోళన


పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


హర్షవర్ధన్ (ఫైల్)

చికిత్స అందకే బాలుడు మృతి చెందాడని ఆరోపణ

అలంపూర్ రూరల్: కుక్క కరిస్తే సరైన చికిత్స అందించకపోవడంతోనే బాలుడు మృతి చెందాడంటూ బాధితులు ఆదివారం క్యాతూర్ పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని క్యాతూర్‌కు చెందిన వెంకటలక్ష్మి, సాయికుమార్ దంపతుల కుమారుడు హర్షవర్ధన్ (4)కు జనవరి 22న కుక్క కరిచింది. దీంతో తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా చిన్న పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అలంపూర్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఎలాంటి చికిత్స అవసరం లేదని సూచించడంతో మిన్నకుండిపోయారు. నెల తర్వాత బాబు వింతగా ప్రవర్తిస్తుండటంతో చికిత్స నిమిత్తం శనివారం కర్నూలు ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించలేమని తేల్చి చెప్పడంతో ఆదివారం తిరిగి గ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బాబు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆదివారం పీహెచ్‌సీ ఎదుట బాలుడి మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ వెంకటస్వామి పీహెచ్‌సీ వద్దకు వెళ్లి కుటుంబసభ్యులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. తండ్రి సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారు పత్తి జిన్నింగ్ మిల్లులో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బేళ్ల తయారీలో భాగంగా యంత్రాలు పనిచేస్తున్న సమయంలో ఆకస్మికంగా యంత్రాల నుంచి నిప్పు రవ్వలు రాజుకుని మంటలు చెలరేగి.. పత్తి బేళ్లకు వ్యాపించాయి. వెంటనే అక్కడి సిబ్బంది పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది నీటితో మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోస్గి: మండలంలో ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ బృందాల దాడులు కొనసాగుతున్నాయి. శనివారం అర్ధరాత్రి మండలంలోని ముశ్రీఫా వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ముశ్రీఫాలో మూడు ట్రాక్టర్లు కనిపించగా.. వాటికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం కడంపల్లి గ్రామానికి చెందిన ఇసుక టిప్పర్‌ను పట్టుకోగా మరోమారు మూడు ట్రాక్టర్లు పట్టుబడటంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.

పస్పులలో మరోకటి..

కోడేరు: మండలంలోని పస్పుల గ్రామం నుంచి అర్ధరాత్రి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్ శివాజీ, ట్రాక్టర్ యజమాని ఆది కృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోకారి తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాతావరణం.. విపత్కర పరిస్థితులు

- ఒక్కో సమయంలో ఒక్కోరకమైన చీడపీడల బెడద
- ముందు జాగ్రత్తలతో నష్ట నివారణ చర్యలు
- జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్ సూచనలు, సలహాలు


బూజు తెగుళ్లు


ముడతబారిన పచ్చిమిర్చి తోట

వాతావరణ పరిస్థితులు	ఉధృతమయ్యే చీడపీడలు
పగటి ఉష్ణోగ్రత తక్కువ మేఘావృతమైన ఆకాశం	లద్దె పురుగు చురుకవుతుంది.
గాలిలో తేమ అధికంగా ఉండి పగటి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే..	పచ్చ దీపపు పురుగులు వృద్ధి చెందుతాయి.
ఎక్కువ కాలం పొడి వాతావరణం ఎక్కువ ఉష్ణోగ్రత	చెరుకు, మిర్చి, జొన్న, పత్తిలో రసం పీల్చే పురుగుల్లో ముఖ్యంగా నల్లి వ్యాపిస్తుంది.
ఎడతెరిపి లేని వర్షాలు పడితే	వరిలో కాండం తొలిచే పురుగుల ఉధృతి తగ్గుతుంది. వరి ఈగ ఉధృతి పెరుగుతుంది.
పూత దశలో వెచ్చని వాతావరణం మబ్బులు కమ్మిన ఆకాశం, తరుచు జల్లులు	వరిలో కంప నల్లి
రాత్రి ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువ, గాలిలో తేమ ఎక్కువ వాతావరణం చల్లగా ఉండటం, మంచు పడటం	వరికి పొట్ట కుళ్లు తెగుళ్లు, అగ్గి తెగుళ్లు సోకుతుంది.
నీటి ఎద్దడి ఎక్కువ కాలం ఉంటే	ప్యూజేరియం విల్టు, కూరగాయలు, పత్తి మొదలైన పైర్ల మీద ప్రభావం చూపుతుంది.
వర్షాలు ఎక్కువ పడి గాలిలో తేమ ఎక్కువగా ఉంటే	ఆముదం పంటకు కాయ కుళ్లు, బూజు తెగుళ్లు సోకుతాయి.
సుదీర్ఘమైన బెట్ట, మధ్య మధ్యలో జల్లులు	పత్తిలో తెల్ల దోమ వ్యాప్తి
వర్షం పడుతున్నప్పుడు, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు	పత్తికి కాయకుళ్లు సోకుతుంది.

అలంపూర్: వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులు ముఖ్యంగా నేల స్వభావం వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. విత్తనం వేసే సమయం నుంచి పంట చేతికి వచ్చే వరకు వాతావరణ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అకాల వర్షాలు, విపరీతమైన ఎండలు, వర్షాభావ పరిస్థితులు, వరదలు, తుఫాన్లు రావడం సర్వ సాధారణంగా మారిపోయింది. ఇలాంటి విపత్కర పరిణామాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ పేర్కొన్నారు. అయితే వీటిని ముందుగా తెలుసుకోగలిగితే కొంత వరకైనా జాగ్రత్తలు తీసుకొని నష్టాలను తగ్గించుకునే అవకాశం కలుగుతుంది. వాతావరణాన్ని బట్టి పురుగులు, తెగుళ్ల వ్యాప్తిపై ముందస్తు సమాచారం తెలుసుకొని నివారణ చర్యలు చేపట్టవచ్చు. తుఫాను సమయంలో మబ్బులు, తేమ వాతావరణం, ఉష్ణోగ్రతలు తగ్గడం వంటివి బూజు తెగుళ్ల ఉధృతికి దోహదం చేస్తాయి. వాతావరణం పొడిగా ఉంటే ఆకుముడత, రసం పీల్చే పురుగుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

బుసిరెడ్డిపల్లి చెరువులో మొసలి కలకలం

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ఊర చెరువులో మొసలి ఉందనే ప్రచారంతో గ్రామస్తులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ చెరువులో మొసలి ఉందనే విషయం పది రోజుల నుంచి ప్రచారం సాగుతోంది. చెరువులో మొసలి కనిపించిన విషయం మత్స్యకారులు, రైతులు గ్రామస్తులకు తెలియపర్చడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు విన్నవిస్తే, వారు చెరువును పరిశీలించి గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పా మొసలిని బంధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు స్పందించి చెరువులో ఉండే మొసలిని బంధించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శిని మహేష్‌గౌడ్‌ను వివరణ కోరగా గ్రామ చెరువులో మొసలి సంచరిస్తుందనే విషయం తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని మరోసారి ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లి దానిని బంధించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసెలు దగ్ధం


మంటల్లో కాలిపోయిన గుడిసెలు

అయిజ: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గుడిసెలు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లాకు చెందిన వెంకట రమణ, వెంకటమ్మ, రమేష్, రాజు కొంత కాలంగా మండల కేంద్రంలోని భరత్ నగర్ కాలనీలో నివాసముంటున్నారు. తిక్కవీరేశ్వర స్వామి జాతరలో గాజులు విక్రయించేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వారు నివాసముంటున్న గుడిసెలకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో రూ.45 వేలు విలువచేసే గాజులు, రూ.10 వేల నగదు, ఫర్నిచర్ తదితర సామగ్రి మంటల్లో దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది.